
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

బుధవారం 11 సెప్టెంబరు 2024



తెరుచుకున్న బొర్రా గుహలు

భారీ వర్షాల వల్ల మూతపడిన బొర్రా గుహలను అధికారులు మంగళవారం తెరిచారు. అయితే 300 మంది పర్యాటకులు మాత్రమే సందర్శించారని యూనిట్ మేనేజర్ గౌరి శంకర్ తెలిపారు.

-అనంతగిరి



గెడ్డల ఉగ్రరూపం

- వర్షం తగ్గినా ఉరకలేస్తున్న మత్స్యగెడ్డ
- జోలాపుట్టు, బలిమెల రిజర్వాయర్లలోకి భారీగా వరద నీరు
- గెడ్డల అవతల ఉన్న పలు గ్రామాలకు బాహ్య ప్రపంచంతో తెగిన సంబంధాలు



పాడేరు మండలం రాయిగెడ్డ కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ నీరు

పాడేరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టినా గెడ్డల ఉధృతి మాత్రం తగ్గలేదు. ఆది, సోమవారాలు అతి భారీ వర్షాల కారణంగా కొండల్లోని ఊటలు అధికం కావడంతో గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో ఏజెన్సీలో ప్రధానమైన మత్స్యగెడ్డలోకి వరద, వాగులు, ఊటల నీరు అధికంగా వచ్చి చేరడంతో మత్స్యగెడ్డ ఉగ్రరూపం దాల్చుతున్నది. పాడేరు మండలం రాయిగెడ్డ కాజ్‌వే పైనుంచి మత్స్యగెడ్డ నీరు, పెదబయలు మండలం గోమంగి వద్ద గెడ్డ, ముంచంగిపుట్టు మండలం లక్ష్మీపురం ప్రాంతంలో బిర్రిగూడ గెడ్డ ఉధృతంగానే ప్రవహిస్తున్నాయి. అలాగే జి.మాడుగులలో మొదలయ్యే మత్స్యగెడ్డ పాడేరు, హుకుంపేట, డుంబ్రిగుడ, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల మీదుగా జోలాపుట్టు జలాశయంలోకి చేరుతుంది. అలాగే డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల్లో, ఒడిశాలోని లమతాపుట్టు బ్లాక్ పరిధి నుంచి వర్షపు నీరు సైతం ముంచంగిపుట్టు మండలంలోని జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లోకి వచ్చి చేరుతుంది. అక్కడి నుంచి ఆ నీరు మాచ్‌ఖండ్ విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి అనంతరం బలిమెల రిజర్వాయర్‌లోకి నీరు చేరుతుంది. అక్కడి ... మిగతా 8వ పేజీలో

రహదారిపై కొండచరియలు

నిలిచిపోయిన రాకపోకలు



ముడసలవీధి- చిలకలవీధి రోడ్డుపైకి దొర్లుకొచ్చిన కొండచరియలు

సీలేరు, సెప్టెంబరు 10: జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధిలోని ముడసలవీధి - చిలకవీధి రహదారిపై కొండచరియలు విరిగిపడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి ధారాలమ్మ జలపాతం ఉధృతంగా ప్రవహించడంతో కొండచరియలు విరిగిపడి ముడసలవీధి- చిలకలవీధి రహదారిపైకి కొట్టుకురావడంతో ఆ మార్గమంతా బండరాళ్లతో నిండిపోయింది. దీంతో గిరిజనులు ధారకొండ వెళ్లడానికి వీలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బండరాళ్లను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కొట్టుకుపోయిన బ్రిడ్జి

సీలేరు, సెప్టెంబరు 10: జీకే వీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధిలోని చిన్న గంగవరం వద్ద వరద ఉధృతికి వంతెన కొట్టుకుపోయింది. దీంతో ఆంధ్రా, ఒడిశాలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ధారకొండ నుంచి గంగవరం మీదుగా పెద్ద గంగవరం , పేట్రాయి మీదుగా ఒడిశాలోని పలు గ్రామాలకు వెళ్లాలంటే ఇదే ప్రధాన మార్గం. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఈ వంతెన కొట్టుకుపోవడంతో పలు గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.



జీకే వీధి మండలం చిన్నగంగవరం వద్ద కొట్టుకుపోయిన వంతెన

జల దిగ్బంధం

ఎటపాక, సెప్టెంబరు 10: గోదావరి వరద పెరగడంతో ఎటపాక మండలంలో వీరాయిగూడెం -నెల్లిపాక గ్రామాల ప్రధాన రహదారిపైకి వరదనీరు చేరి మంగళవారం ఉదయం నుంచి ఈ రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. మరోవైపు మూరుమూరు వద్ద ప్రధాన రహదారిపై వరదనీరు చేరడంతో భద్రాచలం- కూనవరంనకు రాకపోకలు స్తంభించాయి. చింతూరు మండలంలో వరద ఉధృతి కొనసాగుతోంది. శబరి, సీలేరు నదులతో పాటు సోకిలేరు, చంద్రవంక, చీకటివాగు, కుయుగూరు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలో 22 గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. కూనవరం మండలంలో వరద ప్రభావంతో అన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం-కూనవరానికి పూర్తిగా సంబంధాలు తెగిపోగా, మండలంలోని అన్ని గ్రామాల రహదారులపై వరద వచ్చి చేరింది. వరరామచంద్రపురం మండలంలోని ప్రధాన రహదారులపై భారీగా వరదనీరు చేరుకోవడంతో దాదాపుగా 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మంగళవారం ఉదయం నుంచి గోదావరి వరద భద్రాచలం వద్ద వేగంగా పెరగడంతో సాయంత్రానికి రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి (48 అడుగలు) దాటి ప్రవహిస్తోంది. దీంతో శ్రీరామగిరి, సీతంపేట గ్రామాల మధ్య వరదనీరు రోడ్డుపై చేరుకుంది. శ్రీరామగిరి గ్రామంలో వరదనీరు ఇళ్లలోకి చేరుకోవడంతో గ్రామస్థులు గుట్టపై సొంతంగా నిర్మించుకున్న పునరావాస కేంద్రాల్లోకి సామాన్లతో చేరుస్తున్నారు.



ఎటపాక మండలం మురుమూరు వద్ద ప్రధాన రహదారిపై వరద నీరు



సంపంగిగొంది వద్ద కొండచరియలను తొలగిస్తున్న దృశ్యం

సీలేరు-జీకే వీధి రహదారి అస్తవ్యస్తం

- ఏడు చోట్ల కొట్టుకుపోయిన వంతెనలు
- 15 చోట్ల రహదారిపై విరిగిపడిన కొండచరియలు
- 160 గ్రామాలకు రాకపోకలు బంద్

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 10: సీలేరు- గూడెంకొత్తవీధి అంతర్‌రాష్ట్ర ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా తయారైంది. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఈ మార్గంలో ఏడు చోట్ల వంతెనలు కొట్టుకుపోయాయి. 15 చోట్ల కొండచరియలు విరిగి రహదారిపై పడ్డాయి. సీలేరు-గూడెంకొత్తవీధి ప్రధాన రహదారికి గత ఐదేళ్లుగా ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ఈ రహదారి అత్యంత అధ్వానంగా తయారైంది. తాజాగా కురిసిన వర్షాలకు ఈ రహదారి పూర్తిగా ధ్వంసమైపోయింది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్ర ప్రాంతాలకు కలిపే ప్రధాన రహదారి కావడంతో ఈ ప్రాంతంలో రాకపోకలు నిలిచిపోయి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా జీకేవీధి-సీలేరు మధ్యఉన్న 160 గ్రామాల ప్రజలకు పొరుగు గ్రామాలకు వెళ్లే మార్గం లేకుండా పోయింది. దీనికి తోడు సెల్ సిగ్నల్స్ కూడా నిలిచిపోయాయి. ఆస్పత్రులకు వెళ్లే మార్గంలేక ఇబ్బంది పడుతున్నారు.

పలు చోట్ల ధ్వంసమైన రహదారి, వంతెనలు

సీలేరు-గూడెంకొత్తవీధి ప్రధాన రహదారి పలు చోట్ల ధ్వంసమైంది. ప్రధానంగా వలసగెడ్డ ప్రధాన బ్రిడ్జి కొట్టుకుపోయింది. పాలగెడ్డ, లంకపాకలు, సంపింగిగొంది మధ్యలోనూ వంతెనలు కొట్టుకుపోయాయి. ఈ మార్గంలో 15 చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి.

సవాల్‌గా మారిన పునరుద్ధరణ పనులు

సీలేరు-జీకేవీధి ప్రధాన రహదారి పునరుద్ధరణ ఆర్ అండ్ బీ అధికారులకు సవాల్‌గా మారింది. ప్రస్తుతం సంపంగిగొంది వద్ద కొండచరియలను భారీ ఎక్స్‌కవేటర్లతో తొలగిస్తున్నారు. మంగళవారం కొండచరియలు తొలగిస్తుండగా ఎక్స్‌కవేటర్‌పై భారీ బండరాళ్లు పడిపోయాయి. దీంతో పునరుద్ధరణ చర్యలకు ఆటంకం కలిగింది. ఒక్కొక్క ప్రాంతంలో కొండచరియలు తొలగించుకుంటూ ముందుకు సాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈ రహదారి పునరుద్ధరనకు కనీసం వారం రోజుల సమయం పడుతుందని ఆర్ అండ్ బీ అధికారులు చెబుతున్నారు. పునరుద్ధరణ చర్యలను స్వయంగా ఆర్ అండ్ బీ ఈఈ బాలసుందరంబాబు, ఏఈఈ భరతుడు పర్యవేక్షిస్తున్నారు.



నూతిబంద వద్ద ధ్వంసమైన రహదారి

సీలేరు, భద్రాచలం బస్సులు రద్దు

- రహదారి మరమ్మతుల అనంతరమే సర్వీస్‌లు పునరుద్ధరణ
- పాడేరు, మాడుగుల సర్వీస్‌లు చోడవరం వరకే...

విశాఖపట్నం, సెప్టెంబరు 10: విశాఖ నుంచి సీలేరు రాకపోకలు సాగించాల్సిన నాలుగు బస్సులు, భద్రాచలం నుంచి రాకపోకలు సాగించాల్సిన నాలుగు బస్సులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం ప్రకటించింది. ఈ నెల ఒకటో తేదీన కురిసిన వర్షాలకు రోడ్లు జలమయం కావడంతో రెండో తేదీ నుంచి ఈ సర్వీస్‌లను రద్దు చేశారు. రెండు రోజుల నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టడంతో బస్సులు నడిపేందుకు ఇంజనీరింగ్ అధికారులు రూట్ సర్వే నిర్వహించారు. అయితే అనేకచోట్ల గోతులు/గండ్లు పడి ఉండడంతో ఆ మార్గంలో బస్సులు నడపడం సాధ్యం కాదని ఇంజనీరింగ్ అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో మొత్తం గండ్లు, గోతులు పూడ్చిన తరువాత ట్రయల్ రన్ వేసిన తరువాత ప్రయాణికులకు సేవలు అందిస్తామని అధికారులు వెల్లడించారు.

నేటి నుంచి అరకు బస్సుల పునరుద్ధరణ

భారీ వర్షాల కారణంగా విశాఖ నుంచి అరకులోయ రాకపోకలు సాగించే మూడు బస్సులను గత శనివారం నుంచి నాలుగు రోజుల పాటు రద్దు చేశారు. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలించడంతో బుధవారం నుంచి ఈ సర్వీసులను పునరుద్ధరించనున్నట్టు రీజియన్ అధికారులు ప్రకటించారు. విశాఖపట్నం నుంచి మాడుగుల, పాడేరు వెళ్లాల్సిన సర్వీసులను చోడవరం వరకు మాత్రమే నడుపుతున్నారు. భారీ వర్షాల కారణంగా చోడవరం నుంచి మాడుగుల, పాడేరు రూట్‌లు బాగా పాడయ్యాయి. దీంతో చోడవరం వరకే నడిపాలని నిర్ణయించారు.

గిరిజన గ్రామాలకు శాశ్వత రహదారులు

- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం
- సీలేరు-జీకేవీధి రహదారి పునరుద్ధరణ వేగవంతం
- గత వైసీపీ ప్రభుత్వ తప్పిదాలతో తీరని నష్టం
- తెరపల్లి గ్రానైట్ క్వారీపై విచారణ చేపట్టాలి
- పంటలు నష్టపోయిన ఆదివాసీలకు పరిహారం
- గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి
- చింతపల్లి, జీకేవీధి మండలాల్లో విస్తృత పర్యటన



జీకేవీధి-సీలేరు రహదారి పరిస్థితిని మంత్రి సంధ్యారాణికి వివరిస్తున్న ఆర్ అండ్ బీ ఈఈ బాలసుందరంబాబు

చింతపల్లి, సెప్టెంబరు 10: ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ గిరిజన గ్రామాలకు శాశ్వత రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని గిరిజన సంక్షేమశాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. జీకేవీధి- సీలేరు మార్గం నాలుగు రాష్ట్రాలను కలిపే రహదారి కావడంతో పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. మంగళవారం చింతపల్లి, జీకేవీధి మండలాల్లో పర్యటించిన మంత్రి ఉదయం లంబసింగి ఏపీటీడీసీ రిసార్ట్స్ వద్ద జిల్లా అధికారులు, పార్టీ నాయకులతో సమావేశమై గిరిజన ప్రాంతంలో అధిక వర్షాల వల్ల కలిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచి మడిగుంట చేరుకున్న ఆమె వర్షానికి కొట్టుకుపోయిన కాజ్‌వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యంత అధ్వానంగా ఉన్న జీకేవీధి- సీలేరు రహదారి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లి నిర్మాణాలకు అవసరమైన నిధులను తక్షణమే మంజూరు చేయిస్తామన్నారు. రహదారి నిర్మాణ పనులు సాధ్యమైనంత వేగంగా ప్రారంభిస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ తప్పిదాలు ఇప్పుడు తీరని నష్టం కలిగిస్తున్నాయన్నారు. అక్కడకు వచ్చిన ఆదివాసీలు తెరపల్లి గ్రానైట్ క్వారీ వల్ల తాగునీరు కలుషితమవుతున్నదని, పలు వ్యాధులకు ... మిగతా 8వ పేజీలో

అప్రమత్తంగా ఉండండి

- ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే తక్షణం రక్షణ, సహాయక చర్యలు చేపట్టండి
- ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశం
- విశాఖ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్
- జలాశయాల స్థితిగతులు ఎప్పటికప్పుడు తెలుసుకోండి
- గేట్ల పనితీరు పనితీరు పరిశీలించండి
- ప్రతి గ్రామంలో ఐదుగురితో ఆపద మిత్ర బృందాలను ఏర్పాటుచేయండి
- వరద సహాయక చర్యలపై శిక్షణ ఇవ్వండి



మాట్లాడుతున్న హోం శాఖా మంత్రి అనిత

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తక్షణ రక్షణ, సహాయక చర్యల్లో బాధ్యతగా వ్యవహరించాలని ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులను రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. వైపరీత్యాల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీవర్షాల వల్ల వాటిల్లిన నష్టం, తీసుకున్న సహాయ చర్యలపై విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతా రామరాజు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో మంగళవారం ఉదయం విశాఖ పట్నం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ భారీవర్షాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రతి ఒక్కరూ అప్ర మత్తంగా ఉండాలని, విజయవాడలో మాదిరిగా సహాయ రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదే శించారు. వర్షాకాలంలో నీటి పారుదల శాఖ అధికారులతో జిల్లాలోని జలాశయాల స్థితిగతులపై కలెక్టర్లు సమీక్షిస్తుండాలని ఆదేశించారు. పనిచేయని, పాడైన రిజర్వాయర్ గేట్లకు మరమ్మతులు చేయించాలని సూచించారు. భారీవర్షాల సమయంలో పొరుగు రాష్ట్రాల నుంచి ముందస్తు సమాచారాన్ని సేకరించడం ద్వారా జిల్లాలో ముంపు, పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు ముందుగా తరలించేందుకు వీలుంటుందన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా చూడడమే కాకుండా, సహాయ చర్యల్లో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతోపాటు వారి బోట్లను కూడా వినియోగించు కునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ... మిగతా 8వ పేజీలో

చింతలూరులో అతిసార

ఒకరి మృతి, పది మందికి అస్వస్థత



మృతుడు కొర్ర రాము (ఫైల్)



ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంపరి లక్ష్మి

చింతపల్లి, సెప్టెంబరు 10: మండలంలోని చింతలూరు గ్రామంలో అతిసార ప్రబలింది. మంగళవారం ఉదయం ఓ గిరిజనుడు అతిసారతో మృతి చెందగా, గ్రామంలో పది మంది అస్వస్థతతో బాధపడుతున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 6వ తేదీన గ్రామంలో కొంత మంది గిరిజనులు అతిసార బారిన పడ్డారు. గ్రామానికి చెందిన కొర్ర రాము (50), కొర్ర అర్జున్ వాంతులు, విరేచనాలకు బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు సోమవారం చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అర్జున్ కోలుకోగా, కొర్ర రాము మంగళవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే గ్రామంలో సంపరి లక్ష్మి, గెమ్మెలి శాంతి, కొర్ర లక్ష్మణరావు సోమవారం రాత్రి నుంచి వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ప్రైవేటు వాహనాల్లో ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. లంబసింగి పీహెచ్‌సీ పారామెడికల్ ఉద్యోగులు సాయంత్రం గ్రామాన్ని సందర్శించి బాధితులకు ప్రాథమిక చికిత్స అందించారు.

సాక్షులను బెదిరించిన వ్యక్తి అరెస్టు

పాడేరురూరల్, సెప్టెంబరు 10: హత్య కేసులో అరెస్టు అయి ఇటీవల బెయిల్‌పై వచ్చి.. సాక్షులను బెదిరిస్తున్న వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు సీఐ దీనబంధు తెలిపారు. సీఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని డల్లాపల్లి పంచాయతీ బూరుగుచట్టు గ్రామానికి చెందిన బుల్లిబాబు అనే వ్యక్తి 2019లో జరిగిన హత్య కేసులో జైలుకు వెళ్లాడు. ఇటీవల బెయిల్‌పై వచ్చిన ఆయన గ్రామంలో ఉన్న సాక్షులు సత్యారావు, కృష్ణలను బెదిరింపులకు గురి చేశాడు. దీంతో సాక్షులు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ఈ ఫిర్యాదుపై గ్రామంలో సీఐ విచారణ చేశారు. ఈమేరకు బుల్లిబాబును అరెస్టు చేసి, విశాఖ సెంట్రల్ జైలుకు తరలించామని సీఐ దీనబంధు తెలిపారు.

ఇద్దరికి ఏడాది జైలు

కొత్తూరు, సెప్టెంబరు 10: నేరం రుజువు కావడంతో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ 10వ అడిషనల్ కోర్టు జడ్జి ఎన్.శ్రీవిద్య మంగళవారం తీర్పు ఇచ్చారని అనకాపల్లి రూరల్ సీఐ రవికుమార్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలివి. అనకాపల్లి మండలం శంకరం గ్రామంలో 2017 ఆగస్టు 25న గొడవ జరుగుతుందని వచ్చిన సమాచారం మేరకు అప్పటి అనకాపల్లి రూరల్ ఎస్‌ఐగా పనిచేస్తున్న ఆదినారాయణరెడ్డి వెళ్లారు. అక్కడ అదే గ్రామానికి చెందిన గూనూరు కనకఅప్పలరాజు, పులికాల కిరణ్‌కుమార్ పోలీసులపై దాడి చేయగా.. వారిరువురిపై కేసు నమోదు చేశారు. దీనిపై పోలీసులు కోర్టులో చార్జిషీటు వేశారు. 2022లో 13వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ఇద్దరి నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష విధించింది. దీనిని సవాల్ చేస్తూ వారు పదవ ఏడీజే కోర్టుకు వెళ్లారు. అక్కడ విచారణ అనంతరం న్యాయమూర్తి శ్రీవిద్య ఏడాది శిక్షను ఖరారు చేస్తూ మంగళవారం తీర్పు ఇచ్చారని సీఐ రవికుమార్ చెప్పారు.

చట్రాపల్లి ఘటనపై కేసు

▸▸ కుమారి మృతదేహానికి పోస్టుమార్టం


గ్రామస్థుల నుంచి వివరాలను సేకరిస్తున్న సీలేరు ఎస్‌ఐ రామకృష్ణ

సీలేరు, సెప్టెంబరు 10 : జీకేవీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాపల్లి గ్రామంలో కొండచరియలు విరిగిపడిన సంఘటనలో మృతి చెందిన కొర్రా కుమారి మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించినట్టు సీలేరు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి కొండచరియలు విరిగిపడి బురదలో కూరుకుపోయి కుమారి మృతి చెందినట్టు గ్రామస్థులు, బంధువులు తెలిపారన్నారు. ఈ సంఘటనలో గాయపడిన ముగ్గురుతోపాటు 60 నుంచి 70 మేకలు మృతి చెందాయని, మూడిళ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం కుమారి మృతదేహాన్ని బంధువులకు అప్పగించామన్నారు. అలాగే గ్రామంలో ఉన్న మిగతా వారిని సప్పర్లలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి తరలించామన్నారు. సీలేరు-జీకేవీధి మధ్య రహదారిపై పేరుకుపోయిన మట్టిదిబ్బలు, చెట్లను ఎక్స్‌కవేటర్ల సాయంతో తొలగిస్తున్నట్టు చెప్పారు.

పాఠశాలల రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి

▸▸ విశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు విజయభాస్కర్


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయభాస్కర్

కశింకోట, సెప్టెంబరు 10 : పాఠశాలల్లో రికార్డుల నిర్వహణ పక్కాగా అమలు చేయాలని విశాఖ జోన్ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు విజయభాస్కర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాలలో జిల్లాలో ఉన్న ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిషనర్ స్థాయి అధికారులు పాఠశాలలను సందర్శించినప్పుడు పూర్తి వివరాలను ఒక ఫార్మెట్‌లో తయారు చేసి సమర్పించాలన్నారు. అలాగే సర్దుబాటు చేసిన సమయంలో ఉపాధ్యాయుల బయోమెట్రిక్ అటెండెన్స్‌ను ట్యాగ్ చేసిన పాఠశాలలకు కమిషనర్, పాఠశాల విద్యాశాఖ బదిలీ చేయడం జరిగిందని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ప్రణాళికబద్ధంగా అమలు చేయాలన్నారు. పాఠశాల కాంప్లెక్స్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ నిబంధనలకు అనుగుణంగా చేయాలన్నారు. మండలానికి 4 నుంచి 5 కాంప్లెక్స్ కేంద్రాలు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. యుడైస్ ప్లస్ 2024-25 డాటా కాప్చర్ ఫార్మెట్‌లో పాఠశాల యాజమాన్య, కేటగిరి, దిగువ, ఎగువ తరగతులకు సంబంధించి సరైన సమాచారం కచ్చితంగా నింపాలన్నారు. సమావేశంలో డీఈవో వెంకటలక్ష్మమ్మ, డిప్యూటీ డీఈవో అప్పారావు, ఎఎస్‌వో ఎంఎస్. ప్రసాద్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై బురద చల్లితే సహించం

▸▸ మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు



తుమ్మపాల, సెప్టెంబరు 10 : రాష్ట్రప్రభుత్వంపై వైసీపీ నాయకులు బురద చల్లే ప్రయత్నం చేస్తే సహించేది లేదని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. బుడమేరు వాగు గట్లపై మట్టిని రూ.500 కోట్లకు అమ్ముకున్న ఘనత వైసీపీ నాయకులదేనన్నారు. కాలువను ఆనుకుని ఏడు కిలోమీటర్ల మేర భూములను వైసీపీ నాయకులు ఆక్రమించుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసుకున్నారని ఆరోపించారు. విజయవాడ బాధితుల పట్ల ఆ పార్టీ నాయకులకు ఏ మాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. గత ఎన్నికల్లో వైసీపీ నాయకుల ఆగడాలను తట్టుకో లేక ప్రజలు బుద్ధి చెప్పినప్పటికీ వారి తీరు మారకపోవడం దారుణమన్నారు. గుడివాడ అమర్‌నాథ్ నోరు అదుపులో పెట్టుకోవాలని.. లేదంటే అతని అక్రమాల చిట్టా బయట పెట్టాల్సి వస్తుందని బుద్ద హెచ్చరించారు.

పెందుర్తిలో జాబ్ మేళా రేపు

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 12న పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధిశాఖ అధికారి సాయి కృష్ణ చైతన్య, జిల్లా ఉపాధి కల్పనాధికారి సుబ్బిరెడ్డి తెలిపారు. ఫైజర్ కంపెనీ, హెటిరో ల్యాబ్, కేఎల్ గ్రూప్ సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ బీఎస్సీ కెమిస్ట్రీ, ఐటీఐ ఫిట్టర్, డిప్లమో ఇన్ ఫార్మసీ కోర్సులు పూర్తిచేసిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 99487 68778 నంబరులో సంప్రదించాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు గురువారం ఉదయం 9 గంటలకు పాలిటెక్నిక్ కాలేజీలో స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

సింహాద్రి నాల్గో యూనిట్‌లో ఉత్పత్తి పునరుద్ధరణ

పరవాడ, సెప్టెంబరు 10 : సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాల్గో యూనిట్‌లో ఉత్పత్తిని సోమవారం అర్ధరాత్రి పునరుద్ధరించారు. ఇదే యూనిట్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఆదివారం ఉత్పత్తి నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించారు. ప్రస్తుతం ప్లాంట్‌లో అన్ని యూనిట్‌లోనూ ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతుందని అధికారులు తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	89.00
లైవ్ ధర	109.00
విత్ స్కిన్	188.00
స్కిన్ లెస్	198.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

నిండుకుండలా కల్యాణపులోవ

రిజర్వాయర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో


నిండుకుండలా తొణికిసలాడుతున్న కల్యాణపులోవ రిజర్వాయర్

రావికమతం, సెప్టెంబరు 10: మండలంలో కల్యాణపులోవ రిజర్వాయర్ నీటితో కళకళలాడుతున్నది. రిజర్వాయర్ ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు కొండ గెడ్డల ద్వారా నీరు వచ్చి చేరుతున్నది. జలాశయం గరిష్ఠ నీటి మట్టం 460 అడుగులు కాగా మంగళవారం నాటికి ఇన్‌ఫ్లో 25 క్యూసెక్కులు మాత్రమే ఉంది. రిజర్వాయర్‌లో నీటి మట్టం 458.7 అడుగులకు చేరి నిలకడగా ఉండడంతో గేట్లు మూసివేసినట్టు జేఈ సత్యనారాయణ దొర తెలిపారు. దీంతో కొత్తనీటితో జలాశయం నిండు కుండలా తొణుకుతూ చూపరులను కనువిందు చేస్తోంది.

పెరిగిన రైవాడ నీటి మట్టం


రైవాడ జలాశయ గేట్ల వద్ద చేరిన నీరు

దేవరాపల్లి : మండలంలోని రైవాడ జలాశయ నీటి మట్టం 111.80 మీటర్లకు చేరింది. జలాశయ గరిష్ఠ నీటి మట్టం 114 మీటర్లు కాగా, ప్రస్తుతం జలాశయంలోకి వెయ్యి క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నది. సోమవారం 111.5 మీటర్లు కాగా మంగళవారానికి 111.80 మీటర్లకు చేరింది. విశాఖ నగరపాలక సంస్థకు 50 క్యూసెక్కులు, ఆయకట్టుకు వంద క్యూసెక్కులు నీరు విడుదల చేస్తున్నారు.

పెద్దేరు నుంచి 559 క్యూసెక్కులు విడుదల

మాడుగుల రూరల్ : మండలంలోని రావిపాలెం పెద్దేరు జలాశయానికి ఇన్‌ఫ్లో పెరుగుతుండడంతో మంగళవారం ఒక గేటు తెరిచి 559 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా భారీ వర్షాల కారణంగా ఇన్‌ఫ్లో 1309 క్యూసెక్కులు వస్తుండడంతో 136.35 మీటర్లకు చేరింది. దీంతో అప్రమత్తమై మూడో గేటు తెరిచి 559 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టినట్టు ఏఈ సుధాకర్ రెడ్డి తెలిపారు.

పాయకరావుపేటకు తప్పిన ముప్పు


భూమి ఆనకట్ట వద్ద తగ్గిన తాండవ నది ఉధృతి


చాకలిపేటలో వరద బాధితులకు భోజనం అందజేస్తున్న దృశ్యం

▸▸ నదిలో తగ్గుతున్న నీటి ప్రవాహం
▸▸ ఊపిరిపీల్చుకున్న పట్టణ ప్రజలు
▸▸ వరద బాధితులకు అధికారులు భోజనం సరఫరా

పాయకరావుపేట, సెప్టెంబరు 10 : పాయకరావుపేట వద్ద ఉధృతంగా ప్రవహించిన తాండవ నది మంగళవారం శాంతించడంతో పట్టణంలో లోతట్టు ప్రాంతాలకు ముప్పు తప్పింది. కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం పడుతుండడంతోపాటు తాండవ జలాశయం నుంచి నదిలోకి 10వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో సోమవారం అర్ధరాత్రికి పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పాండురంగస్వామి ఆలయం వెనుక తాండవ నదిని ఆనుకుని ఏటి ఒడ్డువీధి, చాకలిపేట, తోకలవారి వీధి, పార్కువీధి తదితర ప్రాంతాల్లోకి నీరు చేరింది. దీంతో అధికారులు ముందస్తు చర్యగా స్థానిక పాండురంగస్వామి కల్యాణ మండపంలో పునరావాస కేంద్రం ఏర్పాటుచేశారు. అయితే మంగళవారం ఉదయానికి నదిలో నీటి ప్రవాహం తగ్గుతుండడంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పట్టణంలో వరద నీరుచేరిన లోతట్టు ప్రాంతాల్లోని సుమారు 200 మందికి రెవెన్యూ అధికారులు మధ్యాహ్న భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జయప్రకాష్ టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు వేములపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వరాహా నది ఉధృతి


గొట్టివాడ ఘాట్ రోడ్డు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరాహా నది

కోటవురట్ల, సెప్టెంబరు 10: ఎగువ నుంచి వరద నీరు వస్తుండడంతో మండలంలోని పాతరోడ్డు వద్ద సర్పా, వరాహా నదుల ఉధృతి కొనసాగుతోంది. నర్సీపట్నంలోని రావణాపల్లి, రావికమతం మండలం కల్యాణపులోవ రిజర్వాయర్ల నుంచి నీరు అధికంగా ఉండడంతో మూడు రోజుల నుంచి వరాహా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వరాహా నదిలో నీరు పుష్కలంగా ఉండడంతో ఖరీఫ్ పంటలకు సాగునీరు ఢోకా లేదని రైతులు అంటున్నారు. మూడు రోజుల నుంచి వరాహా నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పందూరు, రాజుపేట గ్రామాలకు రాకపోకలు అంతరాయం కలిగింది.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

▸▸ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్. పక్కన జేసీ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 10: క్రీడలతోనే మానసిక ఉల్లాసం పొందవచ్చని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్పోర్ట్స్ ప్రాజెక్టలపై సమీక్షించారు. నక్కపల్లిలో హాకీ మినీ గ్రౌండ్ ఏర్పాటు, పరవాడలో క్రికెట్ గ్రౌండ్ కాంపౌండ్ వాల్ నిర్మాణం, వి.మాడుగులలో 200 మీటర్ల ట్రాక్ నిర్మాణం, వాలీబాల్ కోర్టు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరితగతిన పూర్తిచేయించాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. అదేవిధంగా రాంబిల్లి, అచ్యుతాపురం హైస్కూళ్లలో ప్లే ఫీల్డ్ డెవలప్‌మెంట్ పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవి, క్రీడాధికారులు పాల్గొన్నారు.

ఎస్‌ఈజడ్‌లో ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

▸▸ జిల్లా ఎస్పీ దీపిక


రాంబిల్లి పోలీస్ స్టేషన్ సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా ఎస్పీ దీపిక

రాంబిల్లి, సెప్టెంబరు 10: ఎస్‌ఈజడ్‌లోని పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాల పట్ల సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ ఎం.దీపిక అన్నారు. మంగళవారం ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ దీపిక మాట్లాడుతూ.. పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన ఉండాలన్నారు. తీర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కొనసాగించాలన్నారు. స్థానిక మత్స్యకారులతో కలిసి కమ్యూనిటీ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. గంజాయి రవాణా అరికట్టేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చూడాలన్నారు. ఈనెల 14న జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా రాజీ పడదగ్గ కేసులలో ఇరు పార్టీలకు కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పరవాడ డీఎస్పీ కేవీ.సత్యనారాయణ, సీఐ సీహెచ్ నర్సింగరావు, ఎస్‌ఐ కె. రమణ పాల్గొన్నారు.

కారిపోతున్న సీహెచ్‌సీ భవనం

▸▸ ఏడాది కాకుండానే ఈ దుస్థితి
▸▸ నిర్మాణంలో లోపమే కారణమంటున్న రోగులు
▸▸ అధికారులు, పాలకులు నిర్లక్ష్యం


నూతన సీహెచ్‌సీ భవనంలో వర్షం నీరు లీకవుతుండడంతో బకెట్ పెట్టిన సిబ్బంది

ఎలమంచిలి, సెప్టెంబరు 10 : అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగా పది కాలాలపాటు ఉండాల్సిన ప్రభుత్వ భవనం ఏడాది తిరగకుండానే వర్షాలకు కారిపోతున్నది. నాణ్యతను పాటించకుండా నిర్మించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఇందుకు ఉదాహరణగా స్థానిక సీహెచ్‌సీ నూతన భవనాన్ని పేర్కొనవచ్చు.

ఎలమంచిలి తులసీనగర్‌లో వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.2 కోట్ల వ్యయంతో సీహెచ్‌సీకి నూతన భవనాన్ని నిర్మించారు. అప్పటి ఎమ్మెల్యే, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఏడాది క్రితం నూతన సీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభించారు. నాటి నుంచి అరకొర వసతుల మధ్య సీహెచ్‌సీలో వైద్య సేవలను సిబ్బంది అందిస్తున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆస్పత్రిలోని వైద్యుల గదితోపాటు పేషెంట్లు వైద్య సేవలు పొందే వార్డు కూడా కారిపోతున్నది. ఈ నీరు ఆస్పత్రి ఆవరణంతా తడిసిపోకుండా సిబ్బంది లీకవుతున్న చోట బకెట్ పెట్టారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన ఆస్పతి భవనాలు ఏడాది తిరగకుండానే కారిపోవడం, లీకవడం పట్ల స్థానికులు, రోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. భవనాల నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మించిన కాంట్రాక్టర్, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నీట మునిగిన వరి పొలాల పరిశీలన


నీట మునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం

నక్కపల్లి, సెప్టెంబరు 10: మండలంలోని గొడిచెర్ల, దేవవరం, నామవరం, గునిపూడి గ్రామాల్లో తుఫాన్ వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ భవానీ, బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వి.ప్రసాదరావు, పాయకరావుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు ఉమా ప్రసాద్ నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. నీరు బయటకు పోయే చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరెట్ పొటాష్ వేయాలని సూచించారు. అధిక తేమ వల్ల పాముపొడ తెగులు ఆశించే అవకాశం వుందని చెప్పారు. దీని నివారణకు ఏం చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో సత్యనారాయణ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయరాదంటూ కార్మిక సంఘాలు రాస్తారోకో



నెహ్రూచౌక్ వద్ద ఆందోళన చేస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 10 : స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కార్మిక సంఘాలు, రైతు సంఘాలు మంగళవారం స్థానిక నెహ్రూచౌక్‌లో రాస్తారోకో నిర్వహించాయి. సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు ప్రదర్శనగా నెహ్రూచౌక్‌కు చేరుకుని మానవహారంగా ఏర్పడి, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ బీజేపీ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పరిస్థితి మరింత ఆందోళనకరంగా తయారైందన్నారు. ఈ పరిస్థితిని అధిగమించి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ప్రజలంతా ఐక్యంగా కలిసి పోరాడాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించి చేస్తున్నారని, తర్వాత నిర్వీర్యం చేస్తారన్నారు. టీడీపీ నాయకత్వం కేంద్రంలోని బీజేపీపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శులు ఆర్.దొరబాబు, వైఎన్ భద్రం, వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, ఐద్వా జిల్లా ప్రధానకార్యదర్శి డీడీ వరలక్ష్మి, వీవీ శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, గంటా శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి అప్పన్న ఆలయంలో పవిత్రోత్సవాలు


పవిత్రాలతో ఈఓ, ఆలయ అధికారులు

సింహాచలం, సెప్టెంబరు 10: వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయ వార్షికోత్సవాలలో భాగమైన పవిత్రోత్సవాలను ఈనెల 13 నుంచి 17వ తేదీవరకు నిర్వహించనున్నట్టు ఈవో సింగాల శ్రీనివాసమూర్తి తెలిపారు. 13న రాత్రి ఏడు గంటలకు పుట్టమన్ను మండపంలో అంకురార్పణ, రుత్విక్‌వరణలతో శ్రీకారం చుడతారు. అదేరోజు యాగశాలార్చన, యాగశాల ప్రవేశం, మృత్స్యగ్రహణం ఉంటాయి. 14న ఉదయం పవిత్రాధివాసం, చక్రాబ్జమండల రచన, ఆవాహనం, పవిత్రప్రతిష్ఠలు, 15న రాత్రి పవిత్ర సమర్పణ, 16న ఉదయం పూర్ణాహుతి, పవిత్ర విసర్జన, రథబలి, 17న ఉదయం ఏకాంత స్నపన తిరుమంజనంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. పవిత్రోత్సవాల సందర్భంగా ఆయా రోజుల్లో అన్ని రకాల ఆర్జిత సేవలను రద్దు చేశామని, రాత్రి ఏడు గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామి దర్శనాలు లభిస్తాయని తెలిపారు.

భువనేశ్వర్ చేరే రైళ్ల వేళల్లో తాత్కాలిక మార్పులు

విశాఖపట్నం, సెప్టెంబరు 10: టెర్మినల్ పరిమితుల నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి భువనేశ్వర్ చేరే పలు రైళ్ల వేళలను తాత్కాలికంగా సవరించినట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. వీటిలో ఈ నెల 19న పుణే-భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22881) సాయంత్రం 5.00 గంటలకు, 20వ తేదీన చెన్నై సెంట్రల్-భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12829) ఉదయం 6.10 గంటలకు, 22వ తేదీన సికింద్రాబాద్-భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్ (17016) మధ్యాహ్నం 3.40 గంటలకు, తిరుపతి-భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22880) ఉదయం 6.10 గంటలకు, ఈ నెల 23న తిరుపతి-భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22872) ఉదయం 6.10 గంటలకు చేరే విధంగా వేళలు సవరించామని పేర్కొన్నారు.

ముంచంగిపుట్టులో వాన బీభత్సం

పలు గ్రామాల్లో కోతకు గురైన ప్రధాన రహదారులు

కొట్టుకుపోయిన కల్వర్టులు.. వాహన రాకపోకలకు ఇబ్బందులు

జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లో కొనసాగుతున్న నీటి విడుదల



గర్రం సమీపంలో కొట్టుకుపోయిన కల్వర్టు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 10: మండలంలో వర్షం బీభత్సం సృష్టించింది. మూడు రోజులుగా పడుతున్న వానలకు పలు చోట్ల కల్వర్టులు, రహదారులు దెబ్బతిన్నాయి. జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. మాకవరం సమీపంలో కల్వర్టు నీట మునిగిపోయింది. లక్ష్మీపురం పంచాయతీ ముంతగుమ్మి సమీపంలో వరదనీటి ఉధృతికి కల్వర్టు కుంగిపోయింది. ఇదే మార్గంలో గర్రం కల్వర్టు కొట్టుకుపోయింది. ఫలితంగా సుమారు 30 గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. ముంతగుమ్మి సమీపంలో కల్వర్టు కుంగిపోయిన విషయం తెలుసుకున్న పీఆర్ ఏఈ మురళీక్రిష్ణ, లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ కె.త్రినాథ్ కల్వర్టులను పరిశీలించారు. ఈ మార్గంలో సుత్తిగూడ, ముంతగుమ్మి, బీరుగూడ వంతెనల నిర్మాణం పనులు గత కొన్ని నెలలుగా అసంపూర్తిగా ఉన్నాయని, వాటి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సర్పంచ్ ఏఈ దృష్టికి తీసుకువెళ్లారు. తాత్కాలికంగా రాకపోకలు సాగించే విధంగా ముంతగుమ్మి వద్ద పనులు చేపడతామని, అసంపూర్తిగా ఉన్న వంతెనల నిర్మాణం పనులు త్వరగతిన జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని ఏఈ హామీ ఇచ్చారు. అలాగే కించాయిపుట్టు పంచాయతీ గడ్డిబంద గ్రామానికి వెళ్లే మార్గంలో రహదారి పలు చోట్ల కోతకు గురైంది. దెబ్బతిన్న రహదారి మరమ్మతు పనులు చేపట్టాలని వైస్ ఎంపీపీ సత్యనారాయణ, గిరిజన సంఘం నేత శ్రీను కోరారు. జోలాపుట్టు, డుడుమ జలాశయాల నుంచి భారీగా విడుదల చేయడంతో వనుగుమ్మ, రంగబయలు, దోడిపుట్టు, జోలాపుట్టు, వనుగుమ్మ పంచాయతీల్లో పంట పొలాలు దెబ్బతిన్నాయని వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి, సర్పంచులు మిల్కి, దనియాలు తెలిపారు.

జోలాపుట్టు 43 వేలు.. డుడుమలో 40 వేల క్యూసెక్కుల నీరు విడుదల

ఆంధ్రా ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరందించే డుడుమ, జోలాపుట్టు జలాశయాల నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాల కారణంగా ఆయా జలాశయాల్లోకి వరదనీరు అధికంగా వచ్చి చేరుతున్న విషయం తెలిసిందే. దీంతో గత మూడు రోజులుగా జలాశయాల నుంచి భారీ స్థాయిలో నీటిని దారి మళ్లిస్తున్నారు. జోలాపుట్టు జలాశయంలో 2750 అడుగులు నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం ఉండగా, మంగళవారం 2747.30 అడుగులు నీటి మట్టం నమోదైంది. దీంతో జోలాపుట్టు ప్రధాన జలాశయం నుంచి 4,500, స్పిల్‌వే డ్యాం నుంచి ఆరు గెట్లను ఎత్తివేసి 43 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ జలాశయానికి దిగువ ప్రాంతంలో గల డుడుమ జలాశయంలో 2590 అడుగులు నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం ఉండగా, సోమవారం 2588.2 అడుగులు నీటి మట్టం నమోదైంది. ఈ జలాశయం 3, 5, 7, 8 నంబర్ల గల గేట్లను ఎత్తివేసి 40 వేల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతంలో గల బలిమెలకు దారిమళ్లిస్తున్నారు. వర్షాలు తగ్గకపోవడం, వరద నీరు ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉండడంతో మూడు రోజులుగా నీటిని విడుదల చేస్తున్నా, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడం లేదు. ఫలితంగా నీటి విడుదల కొనసాగిస్తున్నామని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. కాగా, మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రాన్ని సీలేరు కాంప్లెక్స్ సీఈ వాసుదేవరావు సందర్శించారు. నీరు లోపలకు ప్రవేశించడానికి గల కారణాలు, జలాశయాల్లో నీటి నిల్వలను అడిగి తెలుసుకున్నారు. వారం రోజుల్లో ప్రాజెక్టుల్లో విద్యుత్ ఉత్పత్తిని యథాస్థితికి తీసుకువస్తామని, ఇటువంటి సంఘటనలు జరగకుండా చూస్తామని తెలిపారు. ఆయన వెంట ఇంజనీరింగ్ అధికారులు శ్యాంసుదర్, చంద్రశేఖర్‌రెడ్డి, ఎ.వి.సుబ్రహ్మణ్యేశ్వరావు, గోవిందరాజులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బ్రజసుందర్‌పాడి, సత్యకిరణ్, రాజ్‌కుమార్ ఉన్నారు.



డుడుమ జలాశయం నుంచి విడుదల చేస్తున్న నీరు



మాకవరం సమీపంలో నీట మునిగిన కల్వర్టు



జీకే వీధి రైతు సేవా కేంద్రంలో ఉన్న చట్రాపల్లి గిరిజనులు

పునరావాస కేంద్రాల్లో 147 మంది గిరిజనులు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 10: కొండచరియలు విరిగిపోవడం వల్ల నష్టపోయిన చట్రాపల్లి గిరిజనులు 147 మందికి సప్పర్ల పునరావాస కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ వసతి కల్పించారు. అధిక వర్షాల కారణంగా చట్రాపల్లి గ్రామంపై ఆదివారం రాత్రి కొండచరియలు విరిగి పడిన ఘటనలో గ్రామానికి చెందిన కుమారి అనే మహిళ మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం గ్రామానికి చెందిన ఆదివాసీలను కుటుంబాలతో సప్పర్ల పునరావాస కేంద్రాలకు అధికారులు తరలించారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రంలో 70 మంది, ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో 42 మంది, అంగన్‌వాడీ, గ్రామ సచివాలయాల్లో 35 మంది ఉన్నారు. గిరిజనులకు అవసరమైన దుస్తులు అందజేశారు. రెండు రోజులుగా అల్పాహారంతో పాటు రెండుపూటలా భోజనాలు పెడుతున్నారు. అలాగే రక్షిత నీరు, ఇతర సదుపాయాలు కల్పించారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సూచన మేరకు కూటమి నాయకుడు పండా రామకృష్ణ చట్రాపల్లి గిరిజనులకు భోజనాలు వండి పెడుతున్నారు.

నేలకొరిగిన భారీ వృక్షం



బూదరాళ్ల-పెదవలస రోడ్డుకు అడ్డంగా కూలిపోయిన భారీ వృక్షం

కొయ్యూరు, సెప్టెంబరు 10: అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలో బూదరాళ్ల పంచాయతీలో అపార నష్టం వాటిల్లింది. బూదరాళ్ల-పెదవలస రోడ్డుకు అడ్డంగా భారీ వృక్షం నేలకొరిగింది. కొండ ప్రాంతం ఊటలకు బూదరాళ్ల నుంచి పెదవలస వెళ్లే మార్గమధ్యంలో పలు చోట్ల కొండ చరియలు విరిగి పడడం, చెట్లు నేలకూలటంతో రహదారి ఆధారితంగా రాకపోకలు సాగించే సుమారు 15 గ్రామాలతో పాటు పెదవలస మీదుగా కొయ్యూరు, రాజవొమ్మంగి, అడ్డతీగల తదితర పాంతాలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే పంచాయతీలో నూకరాయితోట, కన్నవరం, బొడ్డుమామిడి తదితర పలు గ్రామాలలో ఇళ్లల్లో ఊటలు వచ్చి గోడలు నానిపోయి 20 ఇళ్లు నేలకూలాయి. నూకరాయితోట ప్రాథమిక పాఠశాల పైకప్పు రేకులు ధ్వంసమయ్యాయి. భవనం గోడలు నానిపోయి కూలేందుకు సిద్ధంగా ఉంది. బాధిత గిరిజనులను ఆదుకోవడంతో పాటు బూదరాళ్ల-పెదవలస రహదారిని పునరుద్ధరించాలని పంచాయతీ వాసులు కోరుతున్నారు.

కైలాసపట్నం కలుషిత ఆహార బాధితులకు పరిహారం చెల్లించాలని మంత్రికి వినతి

చింతపల్లి, సెప్టెంబరు 10: కైలాసపట్నం కలుషిత ఆహార బాధిత విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం వెంటనే చెల్లించాలని బాధిత ఆదివాసీలు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం చింతపల్లి, జీకే వీధి మండలాల పర్యటనకు వచ్చిన మంత్రిని లంబసింగిలో బాధిత గిరిజనులు, విద్యార్థులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షలు, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకున్న బాధిత విద్యార్థులకు రూ.50 వేలు అందజేస్తామని ప్రకటించడం జరిగిందన్నారు. నగదు చెక్‌ను జిల్లా కలెక్టర్ అందజేశారన్నారు. అయితే అస్వస్థతకు గురై కోలుకున్న విద్యార్థులకు ప్రభుత్వం పరిహారం పూర్తి స్థాయిలో చెల్లించలేదని మంత్రికి వివరించారు. వెంటనే పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్టు బాధిత గిరిజనులు తెలిపారు.

స్టాఫ్‌నర్సులను రెగ్యులర్ చేయాలి

డుంబ్రిగుడ, సెప్టెంబరు 10: పీహెచ్‌సీలో కాంట్రాక్టు ప్రాతిపాదికన పని చేస్తున్న స్టాఫ్‌నర్సులను రెగ్యులర్ చేయాలని కోరుతూ డుంబ్రిగుడ వైద్యాధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు దీన, కొండమ్మ మాట్లాడుతూ 24 గంటలూ ఆసుపత్రుల్లో గిరిజనులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా తమను రెగ్యులర్ చేయడంలో జాప్యం జరగడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని వినతి పత్రంలో వారు కోరారు.

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

అరకులోయ, సెప్టెంబరు 10: తుఫాన్ కారణంగా ముంపునకు గురైన ప్రాంతాల్లో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మంగళవారం పర్యటించారు. మాడగడ గ్రామంలో వరద చేరి బురదమయమైన గృహాలను వైస్ ఎంపీపీ రామన్న, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు బియ్యం పంపిణీ చేశారు. ప్రభుత్వ పరంగా పరిహారం అందేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం పీహెచ్‌సీలు, గ్రామ సచివాలయాలను తనిఖీలు చేశారు.



మాడగడలో ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

జలాశయాలకు తగ్గిన వరద ఉధృతి

- గుంటవాడ జలాశయం నీటి విడుదల నిలిపివేత
- డొంకరాయి నుంచి 87 వేల క్యూసెక్కులకు తగ్గింపు

సీలేరు, సెప్టెంబరు 10: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సీలేరు కాంప్లెక్సు పరిధిలోని జలాశయాలకు వరదనీటి తాకిడి (ఇన్‌ఫ్లో) తగ్గింది. దీంతో సోమవారం జలాశయాల నుంచి దిగువకు నీటి విడుదలను జెన్‌కో అధికార్లులు క్రమంగా తగ్గించే చర్యలను చేపట్టారు. డొంకరాయి జలాశయానికి వరదనీటి ఇన్‌ఫ్లో లక్షా 10 వేల క్యూసెక్కుల నుంచి 87 వేల క్యూసెక్కులకు తగ్గుముఖం పట్టడంతో, జలాశయం నుంచి నీటి విడుదలను 87 వేల క్యూసెక్కులకు మంగళవారం ఉదయం నుంచి తగ్గించారు. ఇక్కడ పూర్తిస్థాయి నీటి మట్టం 1037 అడుగులు కాగా, 1029 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయి. అలాగే సీలేరులోని గుంటవాడ జలాశయానికి కూడా పిల్లిగెడ్డ నుంచి వచ్చే ఇన్‌ఫ్లో 23 వేల క్యూసెక్కుల నుంచి ఎనిమిది వేల క్యూసెక్కులకు తగ్గిపోవడంతో, ఇక్కడ నీటి విడుదలను కూడా మంగళవారం ఉదయం నుంచి దశలవారీగా తగ్గిస్తూ మధ్యాహ్నం రెండు గంటల సమయానికి పూర్తిగా నిలిపివేశారు. గుంటవాడ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1360 అడుగుల కాగా, ప్రస్తుతం 1352 అడుగుల నీటి మట్టం ఉంది. అలాగే బలిమెల జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 1516 అడుగులు కాగా, మంగళవారం ఉదయం నాటికి 1508.4 అడుగులు ఉంది.



ఇన్‌ఫ్లో తగ్గడంతో నీటిమట్టం తగ్గిన గుంటువాడ జలాశయం

జలాశయాలను పరిశీలించిన సీఈ

సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు మంగళవారం ఉదయం డొంకరాయి, సీలేరు జలాశయాలను పరిశీలించారు. నీటి నిల్వలు, జలాశయాలకు వస్తున్న ఇన్‌ఫ్లో వివరాలపై అక్కడ ఇంజనీర్లను ఆరా తీశారు. జలాశయాలు ప్రమాద స్థాయికి చేరకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ రామభద్రరాజు, ఏడీఈలు వెంకటమధు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

15న గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం

పాడేరు రూరల్, సెప్టెంబరు 10: అరకువేలి హరిత రిసార్ట్ గోష్టి కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 15వ తేదీన ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ విద్యా శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలతో పాటు సంఘం బలోపేతం, రాష్ట్ర స్థాయిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశానికి రాష్ట్ర శాఖ ప్రతినిధులు, అన్ని జిల్లా శాఖల అధ్యక్ష, కార్యదర్శులు, మండల ప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అప్రమత్తంగా ఉండండి

... 5వ పేజీ తరువాయి

గ్రామంలో ఐదుగురు సభ్యులతో ఆపద మిత్ర బృందాలను ఏర్పాటుచేసి వారికి ప్రకృతి వైపరీత్యాలు సమయంలో తీసుకోవాల్సిన సహాయక చర్యలపై శిక్షణ ఇవ్వాలన్నారు. దీనివల్ల ముందస్తు రక్షణ చర్యలకు అవకాశం కలుగుతుందన్నారు. జిల్లా, మండల కేంద్రాల్లో శాశ్వత టోల్‌ఫ్రీ, ల్యాండ్ లైన్ నంబర్లను ఏర్పాటు చేయాలని, తద్వారా ప్రజలకు అవగాహన పెరుగుతుందన్నారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల ఏడు, ఎనిమిది తేదీల్లో కురిసిన భారీవర్షాల వల్ల జిల్లాలో కొంత మేర నష్టం వాటిల్లినట్టు తెలిపారు. ఎక్కడికక్కడ సహాయ చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ కె.ఫకీరప్ప, విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్‌డీవోలు హుస్సేన్ సాహెబ్, పి.భాస్కర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, జీవీఎంసీ, పౌర సరఫరా, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

గెడ్డల ఉగ్రరూపం

... 5వ పేజీ తరువాయి



నూతిబంద సమీపంలో కూలిపోయిన వంతెన

నుంచి సీలేరు, డొంకరాయి, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాల్లో ఆ నీటి వినియోగం అనంతరం గోదావరి నదిలో కలుస్తుంది. ప్రస్తుతం మత్స్యగెడ్డలోకి వరద నీరు అధికంగా వచ్చి చేరడంతో పాటు ఇతర చిన్న చిన్న గెడ్డలు, వాగులు సైతం ఉధృతంగానే ప్రవహిస్తున్నాయి. దీంతో గెడ్డలు అధికంగా ఉన్న ముంచంగిపుట్టు, పెదబయలు, జి.మాడుగుల, డుంబ్రిగుడ మండలాల్లోని అధిక సంఖ్యలోని గిరిజన గ్రామాల ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. జి.మాడుగుల మండలం చాపగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అవతల ఉన్న 20 గ్రామాల గిరిజనులు ఇళ్లకే పరిమితం కాగా, పెదబయలు మండలం జామిగుడ వద్ద గుంజివాడ గెడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో ఆయా ప్రాంతాల్లోని సుమారుగా 30 గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. అలాగే తాజా పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు గ్రామాల్లోనే సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని గెడ్డలు, వాగులు దాటే ప్రయాణాలు విరమించుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని స్థానికులు అంటున్నారు.

విశాఖ ఉక్కుకు గనులు కేటాయించాలని రాస్తారోకో



అరకు నాలుగు రోడ్ల కూడలిలో రాస్తారోకో చేస్తున్న నాయకులు

అరకులోయ, సెప్టెంబరు 10: మండల కేంద్రంలో విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ప్రైవేటీకరణ యోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని, విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటియూ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు మగ్గన్న నేతృత్వంలో నాయకులు, కార్మికులు అరకు నాలుగు రోడ్ల కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తే సహించేది లేదని నినాదాలు చేశారు. అనంతరం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మోదీ నాయకత్వంలో దొడ్డిదారిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలని కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. విశాఖ ఉక్కును అనివార్యంగా నష్టాల్లో నెట్టాలని మోదీ ప్రభుత్వం భావిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దాడి రాజు, జీసీసీ కార్మికుల సంఘం అధ్యక్షుడు సింహాద్రి, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు హరి, శ్రీను, ఆదివాసీ సంఘం మండల అధ్యక్షుడు బుజ్జిబాబు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు శాశ్వత రహదారులు

... 5వ పేజీ తరువాయి



అద్దరవీధిలో వరి మొక్కలను పరిశీలిస్తున్న మంత్రి సంధ్యారాణి

గురవుతున్నామని మంత్రికి వివరించారు. దీంతో మంత్రి వెంటనే క్వారీపై విచారణ చేపట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తే వెంటనే తవ్వకాలు నిలిపివేయాలని కలెక్టర్ దినేశ్ కుమార్‌ను ఆదేశించారు. పెంటపాడు కాజ్‌వేను పరిశీలించి ప్రత్యామ్నాయ రహదారిని వెంటనే నిర్మించాలని జాతీయ రహదారుల అధికారులను ఆదేశించారు. జీకేవీధి మండలం సంపంగిగొంది వద్ద రహదారిపై పడిన కొండచరియలు, రహదారి పునరుద్ధరణ చర్యలను ఆమె పరిశీలించారు. జీకేవీధి, అద్దరవీధిలో వర్షాలకు కొట్టుకుపోయిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదివాసీలతో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో గిరిజన ప్రాంతాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. ఏ ఒక్క గ్రామానికి రహదారి నిర్మించలేదన్నారు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నిర్మించిన రహదారులపై ఇప్పటికీ ఆదివాసీలు ఆధారపడుతున్నారన్నారు. గూడెంకొత్తవీధి- సీలేరు ప్రధాన రహదారి నిర్మాణాలను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈ కారణంగానే ప్రస్తుతం కురిసిన వర్షాలకు పలు చోట్ల కొండచరియలు విరిగిపడడం, వంతెనలు కొట్టుకుపోవడం వంటి సంఘటనలు జరిగాయన్నారు. ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోవడం వల్ల 32 వేల మంది ఆదివాసీలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయని చెప్పారు. అత్యవసర వైద్యం కోసం రోగులను ఆస్పత్రులకు తరలించే పరిస్థితి లేదన్నారు. దీనికి గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు.

పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం

పంటలను నష్టపోయిన ప్రతి ఆదివాసీ రైతుకి పరిహారం అందిస్తామని మంత్రి సంధ్యారాణి తెలిపారు. జిల్లాలో అధిక వర్షాల వల్ల ఆరు వేల హెక్టారుల్లో పంటలను రైతులు నష్టపోయినట్టు కలెక్టర్ నివేదిక ఇచ్చారన్నారు. ఈ పంట పొలాల పరిస్థితులను స్వయంగా పరిశీలించి నష్టపోయిన ప్రతి రైతును గుర్తించాలని అధికారులకు సూచించామన్నారు. పంటలు నష్టపోయిన రైతులందరిని ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దినేశ్ కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జిల్లా టీడబ్ల్యూ ఈఈ డీవీఆర్ఎం రాజు, జిల్లా వ్యవసాయాధికారి నంద్, జిల్లా ఉద్యానశాఖ అధికారి రమేశ్ కుమార్‌రావు, హౌసింగ్ ఈఈ బి.బాబు, కాఫీ ఏడీ అశోక్ కుమార్, ఆర్ అండ్ బీ ఈఈ బాలసుందరం బాబు, టీడీపీ అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి, మాజీ జీసీసీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు బొర్ర నాగరాజు, చల్లంగి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నాలుగు సబ్ స్టేషన్లకు విద్యుత్ పునరుద్ధరణ

పాడేరు రూరల్, సెప్టెంబరు 10: మన్యంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జీకే వీధి మండలంలో ఏర్పడిన విద్యుత్ అంతరాయాన్ని మంగళవారం సాయంత్రానికి యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించారు. నాలుగు విద్యుత్ సబ్ స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా అందించారు. తుఫాన్ కారణంగా చింతపల్లి నుంచి జీకే వీధి వెళ్లే రహదారులు పూర్తిగా దెబ్బతినడం, కొండ చరియలు విరిగిపడడం, భారీ వృక్షాలు నేలకొరగడంతో పాటు పూర్తిగా మొబైల్ సిగ్నల్స్ లేకపోవడంతో 33 కేవీ విద్యుత్ లైన్‌లో ఎక్కడ అంతరాయం ఏర్పడింది. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అందించిన సహకారంతో చింతపల్లి డీఈ కె.సూర్యప్రకాష్, చింతపల్లి ఏఈ ప్రభాకరరావు ఇతర విద్యుత్ సిబ్బందితో కలిసి సుమారు 30 కిలోమీటర్లు విద్యుత్ లైన్‌ను పరిశీలించి లైన్‌పై ఉన్న చెట్లు కొమ్మలను తొలగించి విద్యుత్‌ను పునరుద్ధరించినట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ అప్పారావు తెలిపారు.

కొండచరియల బాధిత కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

పాడేరు రూరల్, సెప్టెంబరు 10: చట్రాపల్లి గ్రామంలో కొండచరియలు విరుచుకుపడిన ఘటనలో మృతి చెందిన కొర్రా కుమారి కుటుంబానికి రూ.25 లక్షలు నష్టపరిహారం ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ చట్రాపల్లిలో కొండచరియలు విరిగిపడి తీవ్ర విషాదం నింపిందన్నారు. ఈ ఘటనలో గాయపడిన వారికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహకారాన్ని అందించాలని, ఆ గ్రామానికి మోడల్ కాలనీ మంజూరు చేయాలని కోరారు. తుఫాన్ ప్రభావంతో ధ్వంసమైన సీలేరు రహదారి మరమ్మతుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

తుఫాన్ బాధితులను ఆదుకోవాలి

అరకులోయ, సెప్టెంబరు 10: తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే పరిహారం ప్రకటించి ఆదుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి జిల్లా ప్రధానకార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. మాడగడలో ఎనిమిది ఇళ్లల్లో వర్షపు నీరు చేరి సామగ్రితో పాటు పంట దినుసులు మొత్తం పాడయ్యాయని చెప్పారు. గంజాయిగుడలో రెండు కుటుంబాలకు చెందిన ఇల్లు నేలమట్టం కావడంతో బాధితులు బంధువుల ఇళ్లల్లో తలదాచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే చట్రాపల్లిలో కొండచరియలు విరిగిపడి మృతి చెందిన మహిళ కుటుంబానికి, క్షతగాత్రులకు తక్షణమే నష్టపరిహారం అందించాలని బాలదేవ్ డిమాండ్ చేశారు.

డుంబ్రిగుడలో కూలిన ఇంటి గోడ

డుంబ్రిగుడ, సెప్టెంబరు 10: మండల కేంద్రంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కమ్మిడి కొండలరావుకు చెందిన పెంకుటిల్లు గోడ కూలిపోయింది. సామాగ్రి బురదలో కూరుకుపోయాయి. బాధిత కుటుంబీకులు నిద్రిస్తుండగా గోడ కూలిపోయింది. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి తీసుకున్నారు.

పశు వ్యాధులపై అప్రమత్తం ఉండాలి

అనంతగిరి, సెప్టెంబరు 10: పశువులకు సోకే వ్యాధులపై రైతులు గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు సూచించారు. కాశీపట్నం పంచాయతీలోని బంగారమ్మపేట గ్రామంలో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. వ్యాధుల బారినపడిన పశువులకు టీకాలను వేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి రైతులకు పలు సూచనలు చేశారు. వర్షా కాలం కావడంతో పశువులను మేత కోసం తీసుకువెళ్తే శ్వాసకోస, చర్మవ్యాధులు, అనారోగ్యానికి గురవుతాయని, పశువులు మృత్యువాతపడితే ఏహెచ్‌ఏలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి, సుంకరమెట్ట పశు వైద్యాధికారులు సందీప్, సీనయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన

చింతపల్లి, సెప్టెంబరు 10: పీజీ ప్రవేశాల్లో గిరిజన ప్రాంత సర్వీసు పాయింట్స్ కుదించి వేస్తూ జారీ చేసిన జీవో నంబరు-85కి వ్యతిరేకంగా వైద్యులు ఆందోళన కార్యక్రమం చేపడుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. చింతపల్లి మండలంలోని తాజంగి, లోతుగెడ్డ, కోరుకొండ, లంబసింగి పీహెచ్‌సీ వైద్యులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యాధికారుల సంఘం నాయకుడు డాక్టర్ లక్ష్మీకాంత్ మాట్లాడుతూ గతంలో గిరిజన ప్రాంతంలో పని చేసిన వైద్యులకు పీజీ ప్రవేశాల్లో క్లినికల్‌కి 30 శాతం, నాన్ క్లినికల్‌కి 50 శాతం రిజర్వేషన్ ఉండేదన్నారు. ప్రస్తుతం జీవో నంబరు 85 ద్వారా క్లినికల్ 15 శాతం, నాన్ క్లినికల్‌కి 30 శాతం చేశారన్నారు. కొన్ని ప్రధాన పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు అనుమతించడం లేదన్నారు. అలాగే గిరిజన ప్రాంతంలో పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు ఏజెన్సీ అలెవెన్సులు అందజేయడం లేదన్నారు. తక్షణమే జీవో నంబరు 85ను రద్దు చేసి, గతంలో మాదిరిగా గిరిజన ప్రాంతంలో పనిచేసిన వైద్యులకు పీజీలో రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

అనంతగిరిలో...



నల్లబ్యాడ్జీతో విధులు నిర్వహిస్తున్న వైద్యురాలు

అనంతగిరి, సెప్టెంబరు 10: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యులు జ్ఞానేశ్వరీ, జాహ్నవి మంగళవారం విధులు నిర్వహిస్తూనే నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. జీవో నంబర్-85 కారణంగా మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోయిందని, పీజీ అవకాశాలు తగ్గించడం తదితర అంశాలపై దశలవారీగా నిరసనలు చేపడతామని వారు తెలిపారు. ఈ నెల 16వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.

సీఐకు టీడీపీ నాయకుల సత్కారం

డుంబ్రిగుడ, సెప్టెంబరు 10: అరకు సర్కిల్‌లో విధులు చేపడుతున్న సీఐ హిమగిరికి టీడీపీ మండల నాయకుడు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కొములు నాయుడు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మంగళవారం సత్కరించారు. సీఐను మర్యాదపూర్వకంగా కలిసి మండల సమస్యలను తెలిపారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు విన్నవించారు.